క్లుప్తంగా

పకడ్బందీగా జాతరల నిర్వహణ



మల్లూరమ్మ జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ తులసీరాం

చిన్నమండెం : మండలంలో జరగబోవు మల్లూరమ్మ, పాలేటమ్మ జాతర్లను పకడ్బందీగా నిర్వహిస్తామని రాయచోటి రూరల్ సీఐ తులసీరాం తెలిపారు. గురువారం అమ్మవారి జాతరలు జరిగే ప్రదేశాలను స్థానిక ఎస్ఐ రమేష్‌బాబుతో కలిసి సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రదేశాలను వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాతరలు నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి గేటు వితరణ



రామాలయానికి గేటును అందించిన దాతలు

గాలివీడు : మండల కేంద్రంలోని గేటు వద్ద గల సీతారామాలయానికి మండల కేంద్రం నడింపల్లెకు చెందిన పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీరులు ఆలయానికి గేటును వితరణ చేశారు. గేటును గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

నివాళి



బసిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మోహన్‌రెడ్డి

రామాపురం : బండపల్లె గ్రామం పొత్తుకూరివాండ్లపల్లెకు చెందిన సదిపిరాళ్ల బసిరెడ్డి మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మృతుడి స్వస్థలానికి చేరుకొని బసిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనతోపాటు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, కృష్ణారెడ్డి, పలువురు మండల నాయకులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న కమాండెంట్

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ 3వ గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని గురువారం బెటాలియన్ కమాండెంట్ పి. రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకే ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు

రాయచోటి టౌన్ : అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ మైనుద్దీన్ తెలిపారు. గత (బుధవారం) రాత్రి రాయచోటి పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో సుమియా అనే గర్భిణి కాన్పు కాకపోవడంతో ఆపరేషన్ చేయాలని అందుకు (ఏ+) రక్తం కావాలని చెప్పడంతో బాధితులు మమల్ని సంప్రదించడంతో వెంటనే స్పందించి వెంకటేష్ అనే యువకుడితో రక్తదానం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అబుజర్, సమీర్, నవాజ్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా కవితా దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో గురువారం సాయంత్రం ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, రామమోహన్‌నాయుడు, యుగంధరాచారి, కరుణాకర్‌లు తమ కవితలు వినిపించారు.

సారా కేసులో ఒకరు అరెస్టు

కురబలకోట : మండలంలోని ఎర్రమద్దివారిపల్లె కాలనీ వద్ద నాటు సారా విక్రయిస్తున్న గుండ్లూరి బాబుల్ (69)ను గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి



గుట్టపల్లెలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న దృశ్యం



గురిగింజకుంటలో ప్రచారంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

- జీసీల ఓట్ల కోసమే చంద్రబాబు డ్రామాలు
- జీసీలకు రాజకీయంగా వైఎస్సార్‌సీపీ పెద్దపీట
- సంబేపల్లె మండలంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : జగన్ సంక్షేమ పాలన చారిత్రాత్మకమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం గుట్టపల్లె, గురిగింజకుంట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. గుట్టపల్లె గ్రామంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రమేష్ రెడ్డి, రవీంద్ర నాయుడులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేసిన లబ్ధి వివరించి, ప్రజాశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వస్తే మెరుగైన పాలనతోపాటు మరింత సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అందజేస్తామన్నారు. రాజకీయంగా బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ ఒకటేనని ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ క్యాస్ట్ అని వైఎస్ జగన్ ప్రభుత్వం నిరూపించిందన్నారు. వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం, రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, ఆటోవాలాలు పథకాల ద్వారా లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్ కృషి చేశారన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ వైఎస్సార్‌సీపీ బీసీలకు సింహభాగం కేటాయించినట్లు గుర్తు చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసింది చంద్రబాబు నాయుడు అని, అదే బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించింది మాత్రం ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే అని చెప్పేందుకు గర్వంగా ఉందని తెలియజేశారు.

జగన్ వెంటే మేము..

మేమంతా ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ అధినేత, దళితుల మేనల్లుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తామని గుదియవాండ్లపల్లె హరిజనవాడ, బురుజుకాడ హరిజనవాడ, మల్లువాండ్లపల్లె హరిజనవాడల ప్రజలు గడికోట ఎదుట తెలియజేశారు. అలానే కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా సీఎం జగన్ చేయడం అభినందనీయమంటూ కమ్మ కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ అమరనాథరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వి.వెంకటరమణారెడ్డి, నరసింహారెడ్డి, రాళ్లపల్లె రవీంద్ర నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, అన్నారెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొరముట్ల విజయానికి కృషి చేయాలి



ప్రచార కిట్‌ను అందజేస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలుచున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులును భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గురువారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారం, పోలింగ్ సరళి వంటి విషయాలపై కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో చర్చించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరాయన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి ఈ విషయాన్ని చేరవేయాలన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, జగనన్న, శీనన్నలకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధగా ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బూత్ కన్వీనర్లు ప్రణాళికా బద్ధంగా వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి పరిధిలోని ప్రతి ఓటర్‌కు వివరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, గునిశెట్టి రమేష్, సుధాకర్ రాజు, రాజేశ్వరమ్మ, అబ్దుల్ రౌఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్ టాలెంట్ మీట్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : వచ్చేనెల 3, 4వ తేదీలలో ఏఐటీఎస్‌లో నిర్వహించే సీజీఆర్ టాలెంట్ మీట్ – 24 పోస్టర్లను ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆవిష్కరించారు. గురువారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ మీట్‌లో టెక్నికల్ సింపోజియం, ప్రాజెక్టు ఫో, పోస్టర్ ప్రజెంటేషన్, కల్చరల్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ అంశాలు ఉన్నాయన్నారు. టాలెంట్ మీట్‌లో అన్ని ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.నారాయణ, డీన్ సుబ్బారావు, డా.హేమశేఖర్, ఏఓ నూకా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్

నందలూరు(రాజంపేట) : ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని, ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రచెరువుపల్లి, చెన్నయ్యగారిపల్లిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యమన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ తెలియజేశారు. ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ధనుంజయరెడ్డి, కానిస్టేబుల్ రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



సిలిండర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచోటి టౌన్ : వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నుంచి మన స్థిర, చరాస్తులను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై విద్యార్థులకు రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి వివరించారు. గురువారం రాయచోటి పట్టణంలోని నారాయణ స్కూల్‌లో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలు, ఇళ్లలో గ్యాస్, ఇతరా మంటల ద్వారా జరిగే ప్రమాదాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడంతో పాటు మన ఆస్తులను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. మంటలు ఎలా ఆర్పాలనే విషయాలపై సూచనలు, సలహాలు అందించారు. మొదటగా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రమాదం నుంచి బయటపడే దారులను చూడాలని సూచించారు. అలాగే అన్నింటి కన్నా ప్రధానంగా అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం శంకర్ రెడ్డి, ఏఓ నరసింహులు, అకాడమిక్ డీన్ యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ సుగణవేణి, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటను కలుషితం చేయకూడదు



కలుషితమైన కుంట నీరును చూపుతున్న నాయకులు

ఓబులవారిపల్లె : గోవిందంపల్లె పంచాయతీలో ఉన్న కుంటలో మంగంపేటకు సంబంధించిన కలుషిత నీటిని విడుదల చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని సీపీఐ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. మంగంపేట పునరావాస కాలనీ నుంచి వచ్చే మురుగునీరు గోవిందంపల్లె కుంటలో కలవడంతో గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో పలు వ్యాధులు బారినపడుతున్నారని తెలియజేశారు. ఏపీఎండీసీ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి నాగమ్మ, రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి ఎం.శివయ్య, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి గ్రామానికి చెందిన ఓబిలి చిన్నపరెడ్డి, సతీమణి ఓబిలి ప్రమీలమ్మ, కుమారుడు ఓబిలి శివారెడ్డిలు రామాలయం ముందు ఉన్న గ్రామ కంఠం భూమిని ఆక్రమించారని గురువారం తహసీల్దార్ వెంకటనారాయణకు దళవాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాములస్వామి ఉత్సవాల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కావున ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో దళవాయిపల్లి గ్రామ ప్రజలు ఎస్.శ్రీనివాసులు రెడ్డి, సంజీవరెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిద్దారెడ్డి, రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు’



ఉపాధి సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్

రామాపురం : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ పార్టీల ఎన్నికల ప్రచారంలో ఉపాధి సిబ్బంది పాల్గొంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే ఎలాంటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని, ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని, నాణ్యమైన పనులు చేపట్టాలని తెలియజేశారు. సమావేశంలో ఏపీఓ సురేంద్రనాథరెడ్డి, ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, టీఏలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహవాహనంపై గట్టు వెంకటరమణస్వామి



సింహవాహనంపై ఊరేగుతున్న గట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో జరిగే గట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, చక్క భజనల, కోలాటం మధ్య భక్తులు గ్రామ వీధుల్లో స్వామిని ఘనంగా ఊరేగించారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న నరసింహారెడ్డి



సిద్దవటంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మానవులకు, జంతువులకు అన్ని విధాల ఉపయోగపడే అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అడవుల సంరక్షణపై గురువారం ఉదయం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు పక్షులు, జంతువులకు నివాసాలు మాత్రమే కాకుండా అవి సమీపంలో నివసించే ప్రజలకు జీవనాధారంగా ఉపయోగపడుతున్నాయన్నారు. అడవులు ఎక్కువగా ఉంటే వర్షాలు విస్తారంగా కురుస్తాయన్నారు. మానవులు జీవించడానికి అవసరమైన ఆక్సిజన్ అడవుల నుంచి ఉచితంగా లభిస్తుందన్నారు. అడవులను నరికివేయడం వలన భూగోళం వేడెక్కుతుందన్నారు. ఫలితంగా మంచు పర్వతాలు కరిగి సముద్ర తీర ప్రాంతంలోని అనేక నగరాలు మునిగిపోవడం జరుగుతుందన్నారు. అడవులు ప్రాముఖ్యతపై ప్రజలందరికీ అవగాహన కలగజేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం అడవుల సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య, రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవులను రక్షించండి – పర్యావరణాన్ని కాపాడండి

సిద్దవటం : ప్రతి ఒక్కరూ అడవులను రక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవం సదంర్భంగా సిద్దవటం పురవీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లంకమల్ల అడవుల్లోని పంచలింగాల స్వామి ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రేంజర్ కళావతి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడాలన్నారు. పచ్చని చెట్లు పెంపకం వల్ల అధిక వర్షాలు పడతాయన్నారు. డవుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అడవుల్లో చెట్లు నరకడం గాని, నిప్పు పెట్టడం గాని నేరమని తెలియజేశారు. అడవుల్లో సహజంగా లభించే ఆయుర్వేద మొక్కలు వైద్యానికి చాలా ఉపయోగ పడుతాయన్నారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు అంతరించి పోకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని రేంజర్ తెలియజేశారు. కార్యక్రమంలో సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీట్ అధికారులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కార్యదర్శిగా చెన్నారెడ్డి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగం కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన కనపర్తి చెన్నారెడ్డిని నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి గురువారం ఆదేశాలు అందాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు పార్టీ అందించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ, పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని తెలియజేశారు.

అభయాంజనేయుడికి నారా భువనేశ్వరి పూజలు



మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లి జాతీయ రహదారిపై వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి నారా భువనేశ్వరికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దవటం : కోడూరు నుంచి బద్వేలుకు వెళుతున్న నారా భువనేశ్వరిని మండల కేంద్రం శివారులోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద టీడీపీ శ్రేణులు స్వాగతం పలికారు.

పోలింగ్ శాతం పెంచేలా చర్యలు



చిన్నమండెం: అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

సిద్దవటం : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న పోలింగ్ బూత్–19లో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించామని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఎన్నికలపై అవగాహన కల్పించడంలో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలానే రాజంపేట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి టి.మోహన్‌రావు ఆధ్వర్యంలో సిద్దవటం పురవీధుల్లో అధికారులు, సిబ్బంది, ఓటర్లకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ అనూరాధ, పోలీసులు, గ్రామ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ కుమారస్వామి పేర్కొన్నారు. ఓటర్లపై అవగాహన కార్యక్రమంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చని బీఎల్ఓల వద్ద గాని, ఆన్‌లైన్‌లో గాని ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదవ్వండి

రామాపురం : ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సరస్వతిపల్లె పంచాయతీ సెక్రటరీ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీలో గురువారం ఓటు హక్కు వినియోగంపై సచివాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి యువతీ యువకులు ఏప్రిల్ 15వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీలో సచివాలయం కార్యదర్శులు హేమలత, మురళీధర్, మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

చిన్నమండెం : ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణలు అన్నారు. గురువారం మండల పరిధిలోని బోనమల, సి.పాలిమేరపల్లె గ్రామాల్లో ఓటర్లకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి వర్కర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం: మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ప్రజలు

23 నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

గాలివీడు : మండలంలోని పందికుంట గ్రామం దేవరపల్లెలో 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆది భైరవేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఇల కాపులు తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ, దీపారాధన, పుణ్యహవాచనం తదితర పూజా కార్యక్రమాలు. 24 ఆదివారం ఉదయం నుంచి ప్రాతఃకాల పూజలు, వేద పారాయణం, హోమాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, 25న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ అన్నదానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలి



మొక్కను నాటుతున్న విద్యార్థులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ అన్నారు. గురువారం చక్రంపేట జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అలాగే విద్యార్థులు పుట్టిన రోజున హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్నామన్నారు. కాగా గురువారం ముగ్గురు విద్యార్థుల పుట్టినరోజును పురస్కరించుకుని మూడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.